కార్పొరేటుకు దీటుగా ప్రభుత్వ దవాఖాన

అంబర్ పేట మున్సిపల్ హెల్త్ సెంటర్‌లో అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్

- రూ.5.75కోట్ల తో 30 పడకల కొత్త భవనం
- త్వరలో పనులు ప్రారంభించేందుకు చర్యలు
- వచ్చే మార్చిలో అందుబాటులోకి..
- అధికారులతో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

గోల్నాక, సెప్టెంబర్ 28 : కార్పొరేటుకు దీటుగా అంబర్ పేట మున్సిపల్ కాలనీలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను అన్ని సదుపాయలతో తీర్చిదిద్దుతామని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. ఇందుకు సంబంధించి రూ.5.75 కోట్లు మంజూరయ్యాయని ఆయన తెలిపారు. త్వరలోనే కొత్త బిల్డింగ్ పనులు ప్రారంభించి వచ్చే ఏడాది మార్చి లోపు బిల్డింగ్ పూర్తి చే వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని ఆయన తెలిపారు. శనివారం కార్పొరేటర్ విజయ్ కుమార్‌గౌడ్, దవాఖాన ప్రధాన వైద్యురాలు దాక్షాయని, ఏఎంహెచ్‌వో హేమలత, ఇంజినీరింగ్ ఈఈ సునీత, డీఈలు జగదీశ్, శివకుమార్, ఏఈ దీపక్‌లతో కలిసి అంబర్ పేట మున్సిపల్ దవాఖానాలో కొత్త భవనం నిర్మాణ స్థలాన్ని పరిశీలించి అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. అధికారులను అడిగి వివరాలను తెలుసుకున్నారు. ప్రస్తుతం ప్రతి రోజూ 4 వందలకు పైగా ఔట్ పేషెంట్లతో పాటు నెలకు 30 మంది వరకు గర్భిణులకు డెలవరీలు చేస్తున్నామని, అయితే డాకర్లు, సిబ్బంది కొరతతో పూర్తి స్థాయి వైద్య సేవలు అందించలేక పోతున్నామని దావాఖాన ప్రధాన వైద్యరాలు దాక్షాయని వివరించగా వెంటనే పూర్తి స్థాయి వైద్య సిబ్బందిని నియమించేలా ఉన్నతాధికారులతో మాట్లాడతానని ఎమ్మెల్యే తెలిపారు. ఇక కొత్త భవనంతో విశాలమైన ఔట్ పేషెంట్ విభాగం, ఆపరేషన్ థియేటర్, లేబర్ రూం, పేషెంట్ అటెండెంట్లు ఉండే విధంగా రెండు ఫ్లోర్లలో ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేయడంతో పాటు లిఫ్ట్ , ర్యాపింగ్ తదితర నిర్మాణాలను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని ఆయన ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. త్వరలోనే టెండర్లు పిలిచి పక్కా ప్రణాళికతో వచ్చే ఏడాది మార్చి నెల లోగా కొత్త భవనంలో అందుబాటులోకి తేవాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. అంబర్ పేట డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సిద్ధార్థ్ ముదిరాజ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

గుండె ఆరోగ్యం-జీవనశైలిలో మార్పులు, వైద్యం కీలకం

కేర్ హాస్పిటల్స్‌లో అత్యాధునిక గుండె వైద్య సేవలు

గుండె మన జీవితాన్ని నడిపించే అసలైన స్నేహితుడు. చివరి దాకా మనకు తోడుగా నిలిచే ఈ రక్తసంబంధ అవయవం చేసే సేవ అమోఘం. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లతో గుండెకు అనేక సమస్యలు కలుగుతున్నప్పటికీ, అది తట్టుకుని మన జీవితానికి మద్దతు ఇస్తూ మనకు ఊపిరినిస్తూనే ఉంటుంది. కానీ, అది ఆగిపోయిన రోజే మన ప్రస్థానం ముగుస్తుంది. ఇంతటి మేలు చేస్తున్న ఈ అంతర్గత స్నేహితుని పట్ల మనం సరైన శ్రద్ధ చూపటం చాలా అరుదు.

దానిని సరిగ్గా పని చేయనివ్వకుండా, ధూమపానం, మద్యం, జంక్ ఫుడ్ వంటి అనారోగ్యకర అలవాట్లతో గుండెకు అనేక సమస్యలు సృష్టిస్తాం గుండె మనం మితిమీరుతున్నామనే హెచ్చరికలు ఇచ్చినప్పటికీ, వాటిని పట్టించుకోకుండా వాటినే కొనసాగిస్తుంటాం. దీంతో గుండె ఆఖరికి ఒత్తిడిని తట్టుకోలేక, అలసి సొలసి, పని చేయలేక ఆగిపోతుంది.

దేశం వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో మరణాలకు, దీర్ఘకాల అనారోగ్యాలకు హార్ట్ ఫెయిల్యూర్ ఓ ప్రధాన కారణంగా తయారవుతున్నది. జనాభాలో రెండు శాతం మంది దీనివల్ల బాధపడుతున్నారు. ఆయుఃప్రమాణం పెరుగుతుండటం, మరోవైపు అనారోగ్యకర జీవనశైలులు, విస్తరిస్తున్న వాతావరణ కాలుష్యంతో హార్ట్ ఫెయిల్యూర్ కేసుల సంఖ్య పెరుగుతున్నది. రెండు తెలుగు రాష్ట్రాలతో సహా దేశంలోని ప్రధాన ఆస్పత్రులకు చెందిన ఐ.సి.యూ.లలో చేరుతున్న వారిలో హార్ట్ ఫెయిల్యూర్ బాధితుల సంఖ్య గణనీయంగా ఉంటుండటమే కాకుండా క్రమంగా పెరుగుతున్నది కూడా.

ఈ పరిస్థితులలో మన రాష్ట్రంలోని అగ్రశ్రేణి వైద్యసంస్థలు గుండె వ్యాధుల నిర్ధారణ, చికిత్స లకు దేశంలో చాలా ప్రాధాన్యత ఇస్తున్నాయి. గుండె వ్యాధులకు సంబంధించి శస్తచికిత్సల విషయంలో అంతర్జాతీయ స్థాయిలో జరిగే పరిశోధనలు, పరిణామాల ఫలితాలు అతి కొద్ది సమయంలోనే రాష్ట్రంలో అందుబాటులోకి వస్తున్నాయి. వేగంగా, నిరంతరాయంగా సాగుతున్న ఈ అభివృద్ధి వల్ల హార్ట్ ట్రాన్స్ ప్లాంటేషనుతో సహా గుండె వ్యాధుల శస్త్రచికిత్సకు సంబంధించి గడచిన రెండు దశాబ్దాల కాలంలో చాలా మార్పులు వచ్చాయని, ఇందుకు అనుగుణంగా తమ ఆస్పత్రులలో అత్యాధునిక వ్యాధి నిర్ధారణ, శస్త్రచికిత్స పరికరాలు-సౌకర్యాలను అభివృద్ధి చేశారని కేర్ ఆస్పత్రులకు చెందిన వైద్య నిపుణులు తెలిపారు. నిరంతరాయంగా అందుబాటులో ఉండే కార్డియాలజిస్టులు-సర్జన్లు, సర్వసన్నద్ధంగా ఉండే చికిత్సా ఏర్పాట్లతో గుండె వ్యాధులకు సంబంధించి సమస్యలను పరిష్కరించే విధంగా ఈ హార్ట్ ఇనిస్టిట్యూట్ పనిచేస్తున్నట్లు వారు వెల్లడించారు

కేర్ హాస్పిటల్స్‌కు చెందిన కార్డియాలజీ అండ్ హార్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్ వైద్య నిపుణులు గుండె వ్యాధులు, గుండె మార్పిడికి సంబంధించి ప్రత్యేకంగా కృషి చేస్తున్నారు. అంతర్జాతీయ, జాతీయ వైద్య కేంద్రాలలో పనిచేసి విశేష అనుభవం ఉన్న వైద్యనిపుణులు సర్జరీలు నిర్వహిస్తున్నారు. ఈ విభాగంలో అధునాతన పరికరాలతో కూడిన ఆపరేషన్ థియేటర్, రక్తనిధి, వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించే లేబోరేటరీ ఉన్నాయి. ఇటువంటి అత్యున్నత స్థాయి ఏర్పాట్లు ఉండి ఆస్పత్రిలో గుండె మార్పిడి చేయించుకోవటం వల్ల గుండె మార్పిడి శస్త్రచికిత్స ద్వారా సత్ఫలితాలు పొందేందుకు వీలు కలుగుతుంది.

Dr. Lalitha Ravinuthala
Consultant Cardiologist
CARE Hospitals
Nampally

Dr. Usha Rani
Sr Consultant
CTVS Surgeon
CARE Hospitals
Nampally

CARE HOSPITALS
Nampally, Hyderabad
Ph: 040 61 65 65 65
www.carehospitals.com

లంగర్‌హౌస్ ప్రాంతాన్ని రీసర్వే చేయాలి

తాసీల్దార్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్

మెహిదీపట్నం సెప్టెంబర్ 28 : మూసీ పరీవాహక ప్రాంతాల్లో ఇండ్లకు సంబంధించిన సర్వేను తిరిగి చేపట్టాలని కార్వాన్ నియోజకవర్గం ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్‌మొహినుద్దీన్ అన్నారు. శనివారం లంగర్‌హౌస్, కార్వాన్ ప్రాంతాలలో మూసీ పరీవాహక ప్రాంతాల ప్రజలు గోల్కొండ తాసీల్దార్ అహల్యారెడ్డికి తమ ఇండ్లకు మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ వారు చేసిన మార్కింగ్ తప్పుగా ఉందని, దానిని తిరిగి సర్వే చేపట్టాలని ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్‌తో కలిసి వినతి పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పునః సర్వే కోసం జిల్లా కలెక్టర్‌కు కూడా చెప్పామని, ఈ విషయాన్ని ఎంఆర్‌డీసీ వారికి చెప్పి ప్రజలకు న్యాయం చేయాలని చెప్పారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని పేర్కొన్నారు.

ఆందోళన చెందొద్దు.. బుల్డోజర్ కన్నా నేనే ముందుంటా..

- పేదల జీవితాలతో సీఎం రేవంత్‌రెడ్డి చెలగాటం
- గోల్నాక మూసీ నివాసితులకు ఎమ్మెల్యే భరోసా

మూసీ నివాసితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

గోల్నాక, సెప్టెంబర్ 28: సీఎం రేవంత్‌రెడ్డి అనాలోచిత నిర్ణయాలు తీసుకుంటూ పేదల జీవితాలతో చలగాటమాడుతున్నాడని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ విమర్శించారు. శనివారం గోల్నాక డివిజన్ తులసీరాంనగర్ లంకలో అక్కడి నివాసితులతో ఆయన మాట్లాడారు. అంబర్ పేట మూసీ పరీవాహక ప్రాంతాల నివాసితులు తమ ఇండ్లను హైడ్రా కూల్చుతారని భయాందోళనకు గురి కావద్దొని, బుల్డోజర్ కన్నా ముందే నేనుంటామని ఆయన ప్రజలకు భరోసా కల్పించారు. బీఆర్ఎస్ పార్టీ హైడ్రా బాధితులకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కేసీఆర్ పాలనలో ప్రజలను ఇబ్బంది పెట్టలేదని, నగరంలో హైడ్రా తమ ఇండ్లను కూల్చుతుందే మోనన్న భయంతో కొందరు గుండె పోటుకు గురై దవాఖానల్లో చికిత్స పొందుతుండగా మరి కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పేదలు నిర్మించుకున్న ఇండ్లకు ప్రస్తత మార్కెట్ విలువకు రెండింతలు చెల్లించడంతో పాటు అధికారులు చర్చించి వారి ఆమోదం తర్వాతే ఇండ్ల జోలికి రావాలని ఆయన డిమాండ్ చేశారు. ఏ విధమైన కార్యాచరణ లేకుండా పేదల ఇండ్లకు మార్కింగ్ వేసి తొంతర పాటు నిర్ణయాలు ఎందుకు తీసుకుంటున్నారో అర్థం కావడం లేదన్నారు. హైడ్రా బాధితులు ఎలాంటి భయాందోళనకు గురి కావద్దొని తాము రక్షణ కవచంలా అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు.

సనాతన ధర్మాన్ని కాపాడాలి

మాట్లాడుతున్న బజరంగ్‌సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఆర్. లక్ష్మణ్‌రావు, రజని, రూబిమిశ్రా తదితరులు

కాచిగూడ, సెప్టెంబర్ 28 : ప్రతి ఒక్కరూ సనాతన ధర్మాన్ని కాపాడాలని బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఆర్ లక్ష్మణ్‌రావు పిలుపునిచ్చారు. శనివారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతికి అద్దంపట్టే బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా సంప్రాదాయ దుస్తులను ధరించి వైభవంగా జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు. భక్తి పాటలతో బతుకమ్మను ఆడాలని, పిల్లలు బయటకు వెళ్లేటప్పుడు సంప్రాదాయ దుస్తులను వేసుకోవాలని తల్లిదండ్రులు సూచించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు రజని, రూబిమిశ్రా,ఉపాధ్యక్షుడు సంజయ్‌కుమార్, వి.రవి, నగర అధ్యక్షుడు మనోజ్, నరేశ్, కాజల్, సబితా పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

సైబర్ నేరాల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పద్మశ్రీ డాక్టర్ హనుమాన్‌చౌదరి తదితరులు

కాచిగూడ,సెప్టెంబర్ 28 : సైబర్ నేరగాళ్లు కొత్త తరహా నేరాలకు పాల్పడుతున్నారని, వారి పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ప్రద్మశ్రీ డాక్టర్ హనుమాన్‌చౌదరి అన్నారు. సీఏడీఆర్‌టీ వ్యవస్థాపకుడు ఎన్. నర్సింహమూర్తి ఆధ్వర్యంలో శనివారం సైబర్ నేరాలపై అవగాహన సదస్సును కాచిగూడ బద్రుక కాళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హనుమాన్‌చౌదరి, నాస్‌కామ్ డాట సెక్యూరిటీ ఈసీఓ డాక్టర్ రాంబిరువోలు, హైకోర్టు న్యాయవాది దీపక్ బట్టచార్, ఓయూ విశ్రాంత ప్రొఫెసర్ ఎంవీ రామణమూర్తి, విశ్రాంత డీజీపీ గోపినాథ్‌రెడ్డి హాజరై సైబర్ నేరాల పుస్తకాన్ని ఆవిష్కరించి, మాట్లాడారు. ఈ సందర్భంగా హనుమాన్‌చౌదరి మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తులు ఆర్థిక పరమైన లావాదేవీలకు సంబంధించిన వివరాలు పోన్‌లో అడిగితే ఎట్టి పరిస్థితుల్లో స్పందించవద్దని, సైబర్ నేరగాళ్లు సరికొత్త రకం మోసాలకు పాల్పడుతూ, మీ బ్యాంక్ ఖాతా ఖాళీ చేస్తారని సూచించారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసినా.. మేసేజ్‌లు పంపినా స్పందించవద్దన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ శ్రీకిషన్ బద్రుక, డైరెక్టర్ జనరల్ అభిరామకృష్ణ,ఏపీ ఇంటలిజెన్సీ రాంమోహన్,డాక్టర్ డీవీఎస్ఎస్ మూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలను చైతన్యం చేసే రచనలు రావాలి: రమణాచారి

కవి వీర పూర్ణచందర్ రావు రచించిన ద్వీప రాజ్యం, ధనలక్ష్మీ ఆహ్వానం నవలలను ఆవిష్కరిస్తున్న కేవీ రమణాచారి తదితరులు

తెలుగు యూనివర్సిటీ, సెప్టెంబర్ 28 : కమలా కృష్ణ కళా కౌముది సాహితీ సాంస్కృతిక ఆధ్యాత్మిక సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ కవి వీర పూర్ణచందర్‌రావు రచించిన ద్వీప రాజ్యం, ధనలక్ష్మి ఆహ్వానం నవలల ఆవిష్కరణ రెడ్‌హిల్స్‌లో గల రమణాచారి క్యాంపు కార్యాలయంలో శనివారం జరిగింది. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ బ్రాహ్మణపల్లి జయరాములు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ రమణాచారి నవలలను ఆవిష్కరించి రచయిత సాహిత్య శైలిని తన ప్రసంగంలో ప్రశంసించారు. సమకాలీన అంశాలతో ప్రజలను చైతన్యం చేసేల రచనలు సాగిస్తున్న పూర్ణచందర్ రావు మరిన్ని రచనలు చేయాలని ఆయన ఆకాంక్షించారు. సాహితీవేత్తలు పొత్తూరి సుబ్బారావు, పొత్తూరి జయలక్ష్మి, డాక్టర్ గురజాడ శోభాపేరిందేవి పాల్గొన్నారు.

సారస్వత పరిషత్తు సాహితీ పురస్కారాల ప్రకటన

తెలుగు యూనివర్సిటీ, సెప్టెంబర్ 28. తెలుగు సాహిత్యంలోని విభిన్న ప్రక్రియలలో విశేషమైన కృషి చేసిన ఎనిమిదిమంది ప్రముఖులకు తెలంగాణ సారస్వత పరిషత్తు సాహిత్య పురస్కారాలను శనివారం ప్రకటించింది. ఎర్రంరెడ్డి రంగనాయకమ్మ పురస్కారాన్ని ఆచార్య కాత్యాయని విద్యహేకు, ఆచార్య పాకాల యశోదారెడ్డి పురస్కారాన్ని డాక్టర్ భాస్కరయోగికి, డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి సాహిత్య పురస్కారాన్ని మోత్కూరి నరహరికి, డాక్టర్ చింతపల్లి వసుంధరారెడ్డి జానపద సాహిత్య పురస్కారాన్ని ఆచార్య ఎన్.భక్తవత్సల రెడ్డికి, ఆలూరి బైరాగి కవితా పురస్కారాన్ని నాగవరం బాలరాంకు, డాక్టర్ వానమామలై వరదాచార్యుల పురస్కారాన్ని డాక్టర్ వెల్దండ సత్యనారాయణకు, ఆచార్య రావికంటి వసునందన్ సాహితీ పురస్కారాన్ని రేడియం(జె. కొండన్న)కు డాక్టర్ దివాకర్ల వెంకటావధాని పురస్కారాన్ని డాక్టర్ తిరుమల శ్రీనివాసాచార్యకు బహుకరిస్తామని పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె. చెన్నయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 4న సాయంత్రం తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రాంగణంలో గల ఆడిటోరియంలో పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం జరుగుతుందని, ఒక్కొక్కరికీ 5వేల నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో సత్కరిస్తామని తెలిపారు.

కోవిడ్ అనంతరం ప్రజల్లో అవగాహన పెరగడం సంతోషకరం

సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ క్రిష్ణ మాలకొండ రెడ్డిని సన్మానిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జే లక్ష్మణ్ నాయక్, టీసీసీ అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ్‌ముదిరాజ్

సుల్తాన్‌బజార్,సెప్టెంబర్ 28 : ఉస్మానియా యూనివర్సిటీలో 80 శాతం గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు విద్యను అభ్యసించి భవిష్యత్తులో మంచి ఉన్నత స్థాయిలను అందిపుచ్చుకోవాలని ఉస్మానియా మెడికల్ కళాశాల సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ క్రిష్ణమాల కొండరెడ్డి అన్నారు. శనివారం మాసబ్‌ట్యాంక్‌లోని సైఫాబాద్ సైన్స్ కళాశాలలో తెలంగాణ సిటిజెన్ కౌన్సిల్, కళాశాల సంయుక్తాధ్వర్యంలో ఇండక్షన్ కార్యక్రమంతో పాటు వరల్డ్ హార్ట్ డేను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన కళాశాలలో నిర్వహించిన ర్యాలీని కళాశాల ప్రొఫెసర్ జే లక్ష్మణ్ నాయక్, తెలంగాణ సిటిజెన్ కౌన్సిల్ అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్‌లతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కోవిడ్ అనంతరం ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన రావడం సంతోషకరమని అన్నారు. విద్యార్థులు జంక్‌ఫుడ్, ఆయిల్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని అన్నారు. అంతే కాకుండా క్రమం తప్పకుండా నిత్యం వ్యాయామం చేయాలని సూచించారు. విద్యార్థులు ఫోన్‌లకి దూరంగా ఉండాలని ఆయన కోరారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ఈ యేడాది తెలంగాణ సిటిజెన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఆయనను బెస్ట్ కార్డియాలజీ అవార్డుతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీసీసీ ఉపాధ్యక్షుడు శ్రీధర్ ముదిరాజ్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నవనీ త, డాక్టర్ మీనాక్షితో పాటు అకాడమిక్ కోఆర్డినేటర్‌ల, ఎన్ఎస్ఎస్ ప్రొగ్రామింగ్ ఆఫీసర్‌లు డాక్టర్ అరవింద్, డాక్టర్ వెంకటేశ్‌షతో పాటు బోధన, బోధనేతర సిబ్బంది సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

బెదిరింపులు..బుల్డోజర్ ఏకపక్ష నిర్ణయాలు చెల్లవు

ఎడ్ల సుధాకర్‌రెడ్డి

అంబర్‌పేట, సెప్టెంబర్ 28 : బెదిరింపు..బుల్డోజర్ ప్రభుత్వాల ఏకపక్ష నిర్ణయాలు చెల్లవని అంబర్‌పేట నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎడ్ల సుధాకర్‌రెడ్డి అన్నారు. హైడ్రా ద్వారా ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా చాలా మంది ప్రజలు తనను సంప్రదిస్తున్నారని చెప్పారు. దురదృష్టవశాత్తు హైడ్రా, ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా బాధితుల పక్షాన వాదించవద్దని న్యాయవాదులకు ఆర్.ఆర్ బృందం నుంచి ఆదేశాలు వెళ్లావని ఆరోపించారు. న్యాయస్థానాలు కూడా ఈ సమస్యపై విచారణకు వెనకాడుతున్నాయన్నారు. మానవతా ప్రాతిపదికన కాకపోయినా చట్టబద్ధతను పరిగణలోకి తీసుకున్నా అది ప్రభుత్వ భూమి తప్పా ప్రైవేటు పట్టా భూములు ప్రజాస్వామ్యంలో బుల్డోజర్ చేయబడవని తెలిపారు. దుబాయ్ వంటి దేశాలు అత్యాధునిక సాంకేతికతతో మహాసముద్రాలలో ద్వీపాలను నిర్మిస్తున్నారని గుర్తు చేశారు. నిజాం హయాంలో కేటాయించిన బఫర్ జోన్ కోసం పట్టుబట్టడం సమంజసం కాదని పేర్కొన్నారు. నిజాం హయాంలో కంటే ప్రస్తుతం హైదరాబాద్‌లో జనాభా విపరీతంగా పెరిగిందన్నారు. పూర్వం హైదరాబాద్‌లో వ్యవసాయం సాగేది. చెరువులు, కుంటలు ఉండేవి. నేడు హైదరాబాద్ మొత్తం పట్టణీకరణ చెందిందని, నిజాం హయాంలో 15 లక్షల జనాభా ఉంటే నేడు 120 లక్షలకు చేరిందని, ఇప్పుడు ఈ చెరువులు, కుంటలు ఎందుకు అవసరమని ప్రశ్నించారు. నగర ప్రజలకు ఇంటి అవసరాలకు మాత్రమే నీరు అవసరమని, అది గోదావరి, కృషా జలాల ద్వారా అందుతుందని వెల్లడించారు. హైడ్రా బుల్డోజర్ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు.

దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి



కార్వాన్ నియోజకవర్గం లంగర్‌హౌస్ డివిజన్‌లో నిర్వహించే దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని సంగం రామమందిరం మఠాధిపతి రాహుల్‌దాస్ బాబా అన్నారు. లంగర్‌హౌస్ దసరా ఉత్సవ సమితి అధ్యక్షులు బోగి బాల్‌రాజ్, కార్యదర్శి అనిల్ గౌతం, కోశాధికారి శ్రీనివాస్‌లు సంగం మఠాధిపతి రాహుల్‌దాస్ బాబాతో కలిసి దసరా ఉత్సవాల చందా పుస్తకాలను ఆవిష్కరించి, దసరా ఉత్సవాల కోసం చేస్తున్న ఏర్పాట్లు వివరించారు.

-మెహిదీపట్నం, సెప్టెంబర్ 28

గురుకుల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

మైనారిటీ సొసైటీ అధ్యక్షుడు ఫయిముద్దీన్ ఖురేషికి వినతిపత్రం అందజేసిన పీఆర్‌జీటీపీ నాయకులు

కార్వాన్, సెప్టెంబర్ 28 : తెలంగాణ గురుకులాలలోని ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పీఆర్‌జీటీపీ అధ్యక్షుడు వేమిరెడ్డి దిలీప్ కుమార్ అధ్వర్యంలో ప్రతినిధులు టీఎంఆర్ఈఐఎస్ అధ్యక్షుడు, వైస్ చైర్మన్ అయినటువంటి ఫయిముద్దీన్ ఖురేషీని కలిసి వారి సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గురుకుల ఉద్యోగులకు సంబంధించి సమస్యలు పరిష్కరించాలని అన్నారు. గురుకులాల్లో ఆర్థిక, ఆర్థికేతర అంశాలపై వివరించారు. దసరాలోపు తమ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, గుర్రం రమేశ్, ఉప్పు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

70ఏండ్ల ప్రాయంలోనూ రాధేశ్యాం కృషి అభినందనీయం

నృత్య గురువు రాధేశ్యాంను సత్కరిస్తున్న రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేశ్ తదితరులు

తెలుగు యూనివర్సిటీ, సెప్టెంబర్ 28 : మూడు దశాబ్దాలుగా తెలుగు విశ్వవిద్యాలయం సిద్ధేంద్ర కళా క్షేత్రంలో కూచిపూడి నృత్య కళ ప్రాబల్యాన్ని పెంచేందుకు 70ఏండ్ల ప్రాయంలోనూ రాధేశ్యాం కృషి చేయడం హర్షించదగిన విషయమని తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేశ్ అన్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నృత్య శాఖ , దక్షిణ ప్రాంతీయ సాంస్కృతిక కేంద్రం తంజావూరు సంయుక్తాధ్వర్యంలో శుక్రవారం కూచిపూడి నృత్యంలో సూత్రధారుని పాత్ర అనే అంశంపై ప్రముఖ కూచిపూడి నృత్య గురువు రాధేశ్యాం ప్రదర్శనాత్మక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా రాధేశ్యాం బృందం రసరమ్యంగా నృత్య ప్రదర్శనను కొనసాగించి సత్కారం పొందారు. లలిత కళాపీఠం అధిపతి డాక్టర్ కోట్ల హనుమంతరావు, నృత్యశాఖాధిపతి డాక్టర్ వనజా ఉదయ్, గురువులు ఏలేశ్వరపు చలపతి శాస్త్రి, డాక్టర్ రత్నశ్రీ, విజయ్‌పాత్, డాక్టర్ సుధాకర్ పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ గౌతంరావు, కార్పొరేటర్ ఉమాయాదవ్, కృష్ణయాదవ్ తదితరులు

కాచిగూడ,సెప్టెంబర్ 28: ప్రజలు చెత్తను రోడ్లపై వేయకుండా చెత్త ఆటోలో వేసి పరిశుభ్రతను పాటించాలని సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతం రావు విజ్ఞప్తి చేశారు. స్వచ్ఛతాహి సేవలో భాగంగా స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని కాచిగూడ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించారు. అనంతరం అధ్యక్షుడు డాక్టర్ గౌతంరావు, స్థానిక కార్పొరేటర్ ఉమాయాదవ్, మాజీ మంత్రి కృష్ణయాదవ్ పాఠశాల పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. ఈ కార్యకమంలో ఏఎంహెచ్ఓ హేమలత, రమేశ్‌యాదవ్, కృష్ణకుమార్, క్షీర్‌సాగర్, హజరిబాబు, రవియాదవ్, సూరి, లావణ్య, తార, హేమ పాల్గొన్నారు.

గుంటూరు రైల్లో దొంగతనం

కాచిగూడ,సెప్టెంబర్ 28: గుంటూరు రైల్లో ప్రయాణికురాలి బంగారు ఆభరణాలు, ఫోన్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన దేవేంద్రకుమార్ భార్య భారతి(37)గుంటూరు రైల్లో కాచిగూడకు వస్తుండగా మర్కాపురంలో బ్యాగును చూసుకునేసరికి అందులో ఉన్న 6 గ్రాముల బంగారు ఆభరణాలు, ఫోన్‌ను దొంగిలించారు.శనివారం రాత్రి కాచిగూడ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని తదుపరి విచారణ నిమిత్తం మహబూబ్‌నగర్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణాచారి తెలిపారు.

అంబర్‌పేట మండలంలోపూర్తైన మూసీ సర్వే

- ప్రస్తుతానికి రివర్ బెడ్ మాత్రమే
- బఫర్‌జోన్‌కు వెళ్లని అధికారులు

అంబర్‌పేట, సెప్టెంబర్ 28 : అంబర్‌పేట మండల పరిధిలో మూసీ సర్వే పూర్తయింది. రెండు రోజుల పాటు అధికారులు మూసీ పరీవాహక ప్రాంత బస్తీలలో రివర్ బెడ్ పరిధిలోకి వచ్చే కట్టడాలను గుర్తించి మార్కింగ్ చేశారు. మండల పరిధిలోని న్యూతులసీరాం నగర్(లంక), కమలానగర్, దుర్గానగర్, అంబేద్కర్‌నగర్ బస్తీలలో కేవలం 28 కట్టడాలకు మాత్రమే అధికారులు మార్కింగ్ చేశారు. అంటే రివర్ బెడ్ పరిధిలో ఉన్నవాటిని మాత్రమే గుర్తించారు. మొత్తం 28 కట్టడాలలో 7 మాత్రమే డబుల్ బెడ్ రూమ్ పొందడానికి అర్హత ఉన్నవిగా తేల్చారు. మిగతా 21 కట్టడాలు కమర్షియల్ కట్టడాలుగా గుర్తించారు. రివర్ బెడ్ మాత్రమే గుర్తించిన అధికారులు బఫర్ జోన్ పరిధిలోకి వచ్చే వాటి జోలికి వెళ్లలేదు.